క్లుప్తంగా

ఆర్‌ఎన్‌రెడ్డినగర్‌లో శ్రమదానం



ఆర్‌ఎన్‌రెడ్డినగర్‌లో వీధులను శుభ్రం చేస్తున్న మమత తదితరులు

మీర్‌పేట: స్వచ్ఛతా హి సేవలో భాగంగా ఆదివారం మీర్‌పేట కార్పొరేషన్ 6వ డివిజన్ పరిధిలోని ఆర్‌ఎన్‌రెడ్డినగర్‌లో స్థానిక కార్పొరేటర్ మమత, బీఆర్‌ఎస్ మహిళా విభాగం కార్పొరేషన్ అధ్యక్షురాలు పద్మారెడ్డి ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ వీధుల్లోని చెత్తా చెదారాన్ని ఎత్తి శుభ్రం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలంతా బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయరాదని, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక మహిళలు భారతి, భవాని, సుభా షిణి, బిందు, లక్ష్మి, అరుణ, గీత పాల్గొన్నారు.

బాలాజీనగర్ లడ్డూను సొంతం చేసుకున్న లక్ష్మణ్



బాలాజీనగర్ కాలనీ లడ్డూతో లక్ష్మణ్

బడంగ్‌పేట్: బడంగ్‌పేట్ కార్పొరేషన్ 31వ డివిజన్‌లోని బాలాజీనగర్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని లడ్డూను నిమజ్జనం సందర్భంగా వేలం పాట నిర్వహించారు. అదే కాలనీకి చెందిన లక్ష్మణ్ రూ.1.50 లక్షలకు సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు లక్ష్మణ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బాలాజీనగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రవణ్ కుమార్ యాదవ్, ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, కోశాధికారి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, వినాయక్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, మురళి, కాలనీవాసులు ఉన్నారు.

శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో పూజలు



శివలింగానికి పూజలు చేస్తున్న నర్సింహారెడ్డి దంపతులు

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి చిగురింత పారిజాత నర్సింహారెడ్డి దంపతులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో పరమ శివుడు, రాజరాజేశ్వరి అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, పుష్పలంకరణతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరినీ చల్లగా చూడాలని వేడుకున్నారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహ్మద్ ప్రవక్త బోధనలు అనుసరణీయం

బడంగ్‌పేట్: బడంగ్‌పేట కార్పొరేషన్‌లో ఆదివారం మిలాద్ ఉన్ నబీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడ 5వ డివిజన్‌లో నిర్వహించిన వేడుకల్లో మహేశ్వరం నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి పాల్గొని.. ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వమానవ సమానత్వం, శాంతి స్థాపనే లక్ష్యంగా హిందూ, ముస్లింలు కలిసిమెలిసి ఉండాలన్నారు. మహ్మద్ ప్రవక్త బోధనలతో స్ఫూర్తినిపొందాలని, దేశంలో శాంతి, సామరస్యాలను పెంపొందించేందుకు మరింతగా అందరూ కృషి చేయాలని ఆకాంక్షించారు. మహ్మద్ ప్రవక్త బోధనలు అనుసరణీయమన్నారు.

అరెస్టు దారుణం

సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రాంచందర్

కందుకూరు: ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న సీపీఎం, సీఐటీయూ నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించడం ఏమిటని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రాంచందర్ మండిపడ్డారు. మీర్‌ఖాన్‌పేటలో చేపట్టిన అభివృద్ధి పనులను అడ్డుకుంటారనే సమాచారంతో సీపీఎం మండల కార్యదర్శి శ్రీనివాస్, సీఐటీయూ మండల కన్వీనర్ బాల్‌రాజు తదితరులను ఆదివారం ఉదయం పోలీసులు అరెస్టు చేసి పీఎస్‌కు తరలించారు. అయితే పోలీస్‌స్టేషన్‌లో వారిని రాంచందర్ పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ ఫలాలు



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అదనపు గదులను ప్రారంభిస్తున్న సబితారెడ్డి తదితరులు

- నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం
- పేద విద్యార్థులకు ఉన్నత విద్య
- బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి
- మంత్రి సబితారెడ్డి

కందుకూరు: సీఎం కేసీఆర్ పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని మంత్రి సబితారెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని మీర్‌ఖాన్‌పేట, బేకరికంచె పరిధిలో ఏర్పాటు చేస్తున్న మెడికల్ కళాశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం కొత్తగూడ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రూ.2 కోట్లతో నిర్మించిన అదనపు గదులను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని స్పష్టం చేశారు. పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదివేలా డిగ్రీ, న్యాయ విద్య, మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మరోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేలా ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, వైస్ చైర్మన్ విజేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, సర్పంచులు జ్యోతి, సరళమ్మ, ఎంపీటీసీ రాములు, వివిధ గ్రామాల సర్పంచులు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు సాయిలు, లక్ష్మీనర్సింహారెడ్డి, అమరేందర్‌రెడ్డి, రాంరెడ్డి, రేవంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలకు దీటుగా తండాల అభివృద్ధి

మహేశ్వరం: గ్రామాలకు దీటుగా గిరిజన తండాల్లో అభివృద్ధి పనులు చేపట్టి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని హర్షగూడ నుంచి మంఖాల్ డబుల్ బెడ్ రూం ఇళ్ల వరకు రూ.5 కోట్ల నిధులతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ గ్రామ పంచాయతీలతో సమానంగా గిరిజన తండాలకు అధిక నిధులు కేటాయించి అభివృద్ధికి బాటలు వేస్తున్నారని తెలిపారు. కేసీ తండాలో సమీపంలో ఎల్రక్టానిక్ పార్కులో విప్రో, మలబార్ కంపెనీల రాకతో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వచ్చాయని తెలిపారు. గిరిజన తండాల్లో ప్రభుత్వ భూములను సేకరించి పేదలకు 75 గజాల ఇంటి స్థలాన్ని అందిస్తామన్నారు. ఖాళీ స్థలం ఉంటే ఇంటి నిర్మాణానికి రూ. 3 లక్షల ఆర్థిక సాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీపీ రాత్లావత్ సునితా నాయక్, స్థానిక సర్పంచ్ రవి నాయక్,గ్రామస్తులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ అందరి బాధ్యత



స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పాల్గొన్న మౌంట్ కార్మెల్ విద్యార్థులు

బీజేపీ నాయకుడు శ్రీరాములు

బడంగ్‌పేట్: స్వచ్ఛ సర్వేక్షణ్ అందరి బాధ్యత అని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు అన్నారు. మౌంట్ కార్మెల్ గ్లోబల్ స్కూల్ విద్యార్థులు ఆదివారం స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్పొరేషన్ పరిధిలోని శ్రీశ్రీ హోమ్స్ కాలనీలో వినాయక మండపాల వద్ద వ్యర్థాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా శ్రీరాములు పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూప స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రజలందరూ పాల్గొని పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుప్రభ, ఉపాధ్యాయులు, సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఉనికి కోసమే ఎమ్మెల్యేపై ఆరోపణలు



మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్లు రాజశేఖర్‌రెడ్డి, తిరుమల్‌రెడ్డి, భవానీ ప్రవీణ్

వనస్థలిపురం: తన ఉనికిని చాటుకోవడానికే బీజేపీ నాయకుడు సామ రంగారెడ్డి పనికిమాలిన రాజకీయాలు చేస్తున్నారని ఎల్‌బీనగర్‌లో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి చేసిన అభివృద్ధి ఆయనకు కానరావడం లేదని పలువురు బీఆర్‌ఎస్ మాజీ కార్పొరేటర్లు విమర్శించారు. ఆదివారం వనస్థలిపురంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో మాజీ కార్పొరేటర్లు జిట్టా రాజశేఖర్‌రెడ్డి, సామ తిరుమల్‌రెడ్డి, భవానీ ప్రవీణ్ మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా ఆగిపోయిన రిజిస్ట్రేషన్ల సమస్యను 118 జీఓతో పరిష్కరించిన ఘనత సుధీర్‌రెడ్డికి దక్కిందని, దానిని జీర్ణించుకోలేక, జీఓపై కనీస అవగాహన లేకుండా రంగారెడ్డి మాట్లాడుతున్నారని అన్నారు. ఎమ్మెల్యే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇంటి పన్ను తగ్గింపునకు కృషి చేశారని, పన్ను తగ్గించినా రంగారెడ్డికి కనబడటం లేదని అన్నారు. నిత్యం ప్రజల్లో ఉంటూ, వారి అభివృద్ధి, సంక్షేమానికి పాల్పడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని, ప్రజాక్షేత్రంలో వారికి సరైన బుద్ధి చెపుతామని వారు హెచ్చరించారు.

ఆరోగ్య ఆదిబట్లగా తీర్చిదిద్దుదాం

మున్సిపాలిటీ చైర్‌పర్సన్ ఆర్తికగౌడ్



శ్రమదానం చేస్తున్న చైర్‌పర్సన్ ఆర్తిక, కౌన్సిలర్ మహేందర్

ఇబ్రహీంపట్నం రూరల్: ఆరోగ్య ఆదిబట్లగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కొత్త ఆర్తికగౌడ్ పేర్కొన్నారు. ఆదివారం స్వచ్ఛ భారత్ మిషన్ -2023లో ఇండియన్ స్వచ్ఛత లీగ్ 2.0లో భాగంగా గాంధీ జయంతిని పురస్కరించుకొని ఆదిబట్ల మున్సిపాలిటీలోని కొంగరకలాన్ అంబేడ్కర్ చౌరస్తాలో 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ ఆర్తకతో పాటు కమిషనర్ అమరేందర్‌రెడ్డి, కౌన్సిలర్ మహేందర్‌లు చీపురు పట్టి రోడ్లను శుభ్రం చేశారు. చెత్త చెదారం సిబ్బందితో కలిసి ఎత్తివేశారు. ఈ సందర్భంగా ఆర్తికగౌడ్ మాట్లాడుతూ.. ఆదిబట్ల మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తయారు చేయడానికి శక్తి వంచన లేకుండా కృషి చేద్దామన్నారు. పట్టణంలో చెత్త , ప్లాస్టిక్ నివారణ చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రతి రోజు టన్నుకు పైగా చెత్తను సేకరించి డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నామని తెలిపారు. పౌరులు పరిసరాల పరిశుభ్రతకు పాటుపడాలని సూచించారు. నిరంతరం సిబ్బంది, అధికారులే కాకుండా పుర ప్రజల భాగస్వామ్యంతో ఎదైనా సాధించవచ్చని వివరించారు. అలాగే, ప్రస్తుతం సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న నేపథ్యంలో ఆరోగ్యాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దోమల నివారణకు మందులు వేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఆదిబట్ల మున్సిపాలిటీ మేనేజర్ శ్రీనివాస్, సిబ్బంది అశోక్, సురేశ్, సదానందం, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

మండల హోదా ప్రకటించే వరకు ఆందోళన

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండలం ప్రకటించేంతవరకు దీక్షలు కొనసాగుతాయని జేఏసీ నాయకులు రేణురెడ్డి అన్నారు. జేఏసీ ఆధ్వర్యంలో వివిధ పార్టీల నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం 93వ రోజుకు చేరింది. రేణురెడ్డి మాట్లాడుతూ.. మండల ఏర్పాటుకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, వనరులు అన్ని ఉన్నాయన్నారు. 41 రోజులు దీక్షలు చేశామని, ప్రస్తుతం దీక్షలు చేపట్టి 91 రోజులుగా కొనసాగుతున్న ప్రభుత్వం కనీసం స్పందించడం లేదన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీనివాసురెడ్డి, రేణురెడ్డి, చంద్రయ్య, చెన్నయ్య, శివయ్య, పవన్ వాల్మీకి, జగన్, రాంరెడ్డి, మాణిక్యం, వెంకటయ్య, వెంకటేష్, శ్రీను, ఈదమయ్య పాల్గొన్నారు.

ఆమనగల్లులో మంత్రి పర్యటన

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో ఆదివారం ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖామంత్రి హరీశ్‌రావు పర్యటించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌తో కలిసి వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మంత్రి హరీశ్‌రావుకు ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికులు, మున్సిపల్ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రాలు అందజేశారు. మంత్రి హరీశ్‌రావు చకచకా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసి పది నిమిషాలలో పర్యటన పూర్తి చేశారు.



హరీశ్‌రావుకు వినతి పత్రం అందజేస్తున్న ఆశలు, అంగన్‌వాడీలు

అక్రమ అరెస్టులకు భయపడం

- 100 పడకల ఆస్పత్రి, జూనియర్ కళాశాల సాధించి తీరుతాం
- కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు



కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

కడ్తాల్: మండల కేంద్రంలో 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రి , జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం కాంగ్రెస్ పార్టీ, ఎన్ఎస్‌యూఐ నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షను, మంత్రి హరీశ్ రావు పర్యటన నేపథ్యంలో పోలీసులు భగ్నం చేశారు. కాంగ్రెస్ నాయకులను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యయుతంగా మండల కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రి, జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని, ప్రజల పక్షాన, విద్యార్థుల పక్షాన శాంతియుతంగా రిలే నిరాహార దీక్షలు చేస్తుంటే పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. ప్రజా సమస్యలపై ప్రతిపక్ష పార్టీగా ప్రజల కోసం పోరాడుతుంటే అక్రమంగా కేసులు పెట్టి అరెస్ట్‌లు చేయడం ఎంత వరకు సమంజసమని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకుల అక్రమ అరెస్ట్‌లకు, కేసులకు నిరసనగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు షాబుద్దీన్, భానుకిరణ్, రాజేశ్, రవి,, రాజేందర్, తుల్సీరాం, ప్రవీణ్, దర్శన్, క్రాంతి, చందు, ఇద్రీస్, కల్యాణ్, వంశీ,విజయ్‌రాథోడ్ పలువురు నాయకులు ఉన్నారు.

పరిశుభ్రత మన బాధ్యత



శ్రమదానం చేస్తున్న సర్పంచ్ అనిరెడ్డి తదితరులు

మంచాల: పరిసరాల పరిశుభ్రత ప్రజలందరి బాధ్యతని మంచాల సర్పంచ్ అనిరెడ్డి అన్నారు. ఆదివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మంచాల బాలికల వసతి గృహం ఆవరణలో శ్రమదానం చేశారు. చెత్తా చెదారం తొలగించి, పిచ్చి మొక్కలను తీసివేశారు. గ్రామంలోని ప్రజలందరు భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛతా హీ సేవా' విజయవంతం

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధిలోని అన్ని వార్డుల్లో ఆదివారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం విజయవంతం అయిందని పుర కమిషనర్ సీ.హెచ్. శ్రీకాంత్ పేర్కొన్నారు. మన్నెగూడలోని ఆర్టీఓ కార్యాలయంలో ఆర్టీఓ రఘునందన్‌గౌడ్, కౌన్సిలర్లు మర్రి మాధవి, తదితరులతో కలిసి శ్రమదానం చేశారు. అన్ని వార్డుల్లో పరిసరాల పరిశుభ్రత, మురుగు నీటి కాల్వలను శుభ్ర చేయించడం, దేవాలయాలు, అంగన్‌వాడీలు, పబ్లిక్ టాయిలెట్స్, పలు కాలనీల్లో రోడ్లను శుభ్రం చేయించినట్లు కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ శ్రీధర్ రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు నాగేష్, శేఖర్‌రెడ్డి, పలువురు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

చీపురు చేతపట్టి..

హయత్‌నగర్: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలోని ప్రజాప్రతినిధులు, అధికారులు చీపురు చేతపట్టి పరిసరాలను శుభ్రం చేశారు. మున్సిపాలిటీ చైర్‌పర్సన్ స్వప్న, వైస్ చైర్‌పర్సన్ సంపూర్ణారెడ్డిలు 24వ వార్డులో బస్టాండ్, అంగన్‌వాడీ సెంటర్ , ప్రభుత్వ పాఠశాల పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో కమిషనర్ రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో..

ఇబ్రహీంపట్నం: స్వచ్ఛత హీ సేవా లీగ్ 2.0లో భాగంగా ఏక్ తారీఖ్, ఏక్ గంటా, ఏక్ సాథ్ ప్రోగ్రామ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఇబ్రహీంపట్నం ప్రభుత్వాసుపత్రిలోని చెత్తచెదారాన్ని తొలగించి ఎన్ఎస్‌జీ కమాండోలు శుభ్రం చేశారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించి, పర్యావరణాన్ని కాపాడాలని వారు కోరారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్, ఎన్‌జీఓలు పాల్గొన్నారు.



శ్రమదానం చేస్తున్న కమిషనర్, ఆర్టీఓ తదితరులు

ఫార్మా అక్రమాలపై విచారణ చేస్తాం

మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న నేతలు

యాచారం: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఫార్మాసిటీ భూసేకరణ, పరిహారం చెల్లింపులో అక్రమాలపై విచారణ చేయిస్తామనిమాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. తాడిపర్తి, కుర్మిద్ద, గునుగల్ తదితర గ్రామాల నుంచి వివిధ పార్టీలకు చెందిన వంద మంది కార్యకర్తలు ఆదివారం నగరంలోని ఆయన నివాసంలో మాజీ ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేసీఆర్ సర్కార్ ఫార్మాసిటీని రియల్ వ్యాపారంగా మార్చుకుందన్నారు. భూసేకరణలో, పరిహారం చెల్లింపులో అధికార పార్టీ నేతలు, అధికారులకు అనేక అక్రమాలకు పాల్పడ్డారని మండిపడ్డారు. ఫార్మాసిటీని రద్దు చేసి రైతుల భూములు రైతులకే ఇచ్చేస్తామని అన్నారు. నందివనపర్తి గ్రామంలోని ఓంకారేశ్వరాలయానికి చెందిన 1,400 ఎకరాలకు పైగా భూముల్లో ఆయా గ్రామాలకు చెందిన పేద రైతులు ఏళ్లుగా కౌలు చేసుకుని జీవనోపాధి పొందుతున్నారని అన్నారు. అలాంటి రైతులకు న్యాయం చేసేది పోయి, ఆ భూములను కూడా నేడు సర్కార్ లాక్కోవాలని చూస్తుందని విమర్శించారు. ఫార్మాసిటీ భూబాధితులకు , ఓంకారేశ్వరాలయ కౌలు రైతులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కె. శ్రీనువాస్‌రెడ్డి, తాడిపర్తి సర్పంచ్ రమేష్, నల్లవెల్లి ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మీపతిగౌడ్ తదితరులు ఉన్నారు.

ప్రజాగర్జనకు తరలిన బీజేపీ శ్రేణులు



ర్యాలీలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు

కడ్తాల్: పాలమూరులో నిర్వహించనున్న ప్రధాని నరేంద్ర మోడీ ప్రజాగర్జన సభకు ఆదివారం మండల కేంద్రంతో పాటు, ఆయా గ్రామాల నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మాన్యానాయక్, నాయకులు సాయిలాల్‌నాయక్, రాందాస్‌నాయక్, పవన్‌రెడ్డి, శ్రీశైలంగౌడ్, అంజయ్యయాదవ్, మల్లేశ్, ఆంజనేయులు, నరేందర్ తదితరులు ఉన్నారు.

ఆమనగల్లులో బీజేపీ భారీ ర్యాలీ

ఆమనగల్లు: పాలమూరులో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రజాగర్జన సభకు పట్టణం నుంచి ఆదివారం పెద్ద ఎత్తున బీజేపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఆచారి ఆధ్వర్యంలో ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల నుంచి పెద్ద ఎత్తున వెళ్లారు. అనంతరం బీజేపీ నాయకులు బారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు కండె హరి ప్రసాద్, మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, బీజేపీ నాయకులు నర్సింహా, విజయ్‌కృష్ణ, శ్రీశైలంయాదవ్, లక్ష్మణ్, శ్రీదర్, రవి రాథోడ్, ప్రభాకర్,విష్ణుచారి, కేకే.శ్రీను తదితరులు ఉన్నారు.

ఆ స్థలం మాకొద్దు

మైనార్టీ నాయకుల వినతి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

అబ్దుల్లాపూర్‌మెట్: మండలంలోని మజీద్‌పూర్‌లో సర్వేనంబర్ 233లో ఉన్న ప్రభుత్వ భూమిని నగరానికి చెందిన మైనార్టీల శ్మశాన వాటికకు 20 ఎకరాలు కేటాయిస్తున్నట్లు ప్రభుత్వం జీఓ నం. 94ను జారీ చేసింది. తక్షణమే జీఓను రద్దు చేయాలని కోరుతూ గ్రామ సర్పంచ్ పోచంపల్లి సుధాకర్‌రెడ్డి, నాయకులు, గ్రామస్తులు ఆదివారం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం మైనార్టీ శ్మశాన వాటికకు కేటాయించిన భూమికి ఆనుకుని వ్యవసాయ భూములు, నివాస గృహాలు ఉన్నాయని, అలాంటి స్థలంలో శ్మశాన వాటిక ఏర్పాటు చేయడం సరికాదన్నారు. జీఓను తక్షణమే రద్దు చేసి, ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, లేక డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టించి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బాటసింగారం సహకార సంఘం చైర్మన్ విఠల్‌రెడ్డి, ఎంపీటీసీ బాలమణి, ఉపసర్పంచ్ బాలకిషన్, మాజీ ఉపసర్పంచ్ జగన్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీశైలం గౌడ్, వార్డుసభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'గ్యారంటీ'తో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం

ఆ పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి



ఇంటింటికి కాంగ్రెస్‌లో ప్రభాకర్‌రెడ్డి, నాయకులు

తలకొండపల్లి: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించి ఏఐసీసీ నేత సోనియాగాంధీకి బహుమతిగా ఇవ్వాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. తుక్కుగూడ సభలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన 6 గ్యారంటీ పథకాలతో కాంగ్రెస్ పార్టీకు పూర్వ వైభవం రానుందని పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని మెదక్‌పల్లిలో గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి నేరుగా ప్రజలను కలుసుకున్నారు. కాంగ్రెస్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్‌కు రెండు కళ్లలాంటివన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తాని తెలిపారు. ప్రజలు కాంగ్రెస్ వైపు ఆకర్షితులవుతున్నారని, దీంతో కల్వకుర్తిలో కాంగ్రెస్ జెండా ఎగుర వేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శులు అంజయ్యగుప్తా, రవీందర్‌యాదవ్, సోషల్ మీడియా అసెంబ్లీ కన్వీనర్ అజీం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కిసాన్ సెల్ నాయకులు విష్ణు, డిగ్రీ కృష్ణ, మాజీ ఎంపీటీసీ రాములు, డేవిడ్, ఆరీఫ్, మహిళలు పాల్గొన్నారు.